క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ



యూనిఫామ్ అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

జూలూరుపాడు: బీఆర్ఎస్ లోకసభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వారి నామా ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ చేశారు. మండలంలోని 160 మంది ఆటో డ్రైవర్లకు జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, మాజీ ఎంపీపీ మూడ్ చిట్టిబాబు, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, ఎదళ్లపల్లి వీరభద్రం, చాపలమడుగు రామ్మూర్తి, వాంకుడోత్ వెంకన్న, మాలోత్ నరసింహారావు, ఇల్లంగి తిరుపతి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి వేణుగోపాల్

చుంచుపల్లి: కొత్తగూడెం టీచర్స్ భవన్‌లో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చుంచుపల్లి మండల అధ్యక్షుడిగా ఎం.రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా నిర్మల, జానకి, కోశాధికారిగా అక్బర్, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, నాగమణి, రమాదేవి, ఆడిటర్‌గా జగ్గుదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే చెల్లించాలని, ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇస్తూ ట్రాన్స్‌ఫర్ చేయాలని, ఐటీడీఏ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


బూత్ స్థాయి అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

సుజాతనగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల సన్నాహంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి.శిరీష మాట్లాడుతూ... స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో బీఎల్ఓల పాత్ర కీలకమైందన్నారు. మండల వ్యాప్తంగా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. సవరణలు, చిరునామా మార్పులు, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపులను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.కాంతారావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డీఈఓకు వినతిపత్రం



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

జూలూరుపాడు: జూలూరుపాడు హైస్కూల్ పీడీ అరుణ కుమారిని సస్పెండ్ చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం డీఈఓ వెంకటేశ్వర చారిని కొత్తగూడెంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ... స్థానిక హైస్కూల్‌లో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న అరుణ కుమారి విద్యార్థుల చేత తన కారును శుభ్రం చేయించిందని, తక్షణమే సస్పెండ్ చేయాలని డీఈఓను కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బోడా అభిమిత్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సందర్శన

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఉన్న వన్ టౌన్ పోలీసు స్టేషన్‌ను బుధవారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సందర్శించారు. పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, ఎఫ్ఐఆర్‌లు, రికార్డులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐలు, కానిస్టేబుళ్లను పలకరించారు.

పత్తి రైతుపై దళారుల పడగ

ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా పత్తి పంట దెబ్బతిని దిగుబడి తగ్గి నష్టపోగా, వచ్చిన కొద్దో గొప్పో పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తిని మార్కెట్‌లో అమ్ముకోవడానికి తీసుకొస్తే వ్యాపారులు కొర్రీలు పెడుతూ అడ్డగోలుగా కొనుగోళ్లు చేస్తూ దగా చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇటీవల మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన అకాల వర్షంతో చేనులోనే పత్తి తడిసిపోవడంతో రైతులకు మరింత శాపంగా మారింది. పత్తి రంగు మారిందని, తేమ శాతం అధికంగా ఉందని, నలక, పుచ్చుందని తదితర కారణాలతో నాణ్యత కోల్పోయిందనే సాకుతో అతి తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మరో వైపు వేబ్రిడ్జీల తూకంలో కూడా తేడా వస్తుండటంతో నష్టపోతున్నట్లు చెబుతున్నారు.

- కొనుగోలుకు వ్యాపారుల కొర్రీలు
- గిట్టుబాటు ధర రాక నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని సంబంధిత శాఖాధికారులు



జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డు

జూలూరుపాడు: ఈ ఏడాది పత్తి పంటకు ఆది నుంచి ప్రతికూల పరిస్థితులే ఎదురవుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో ఇబ్బంది పడగా, పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో ఈ ఏడాది పత్తి పంట కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు. గత ఏడాది పత్తి క్వింటాల్ ధర రూ.13 వేల వరకు పలికినా సీజన్ ముగిసే సమయానికి రూ.9 వేలకు వచ్చింది. దీంతో రైతులు ధర పెరుగుతుందనే ఆశతో ఇళ్లలో నిల్వ చేయగా, ఈ ఏడాది సీజన్‌కు ముందే ధర పతనమైంది. అక్టోబర్ నుంచి కొత్త పత్తి సీజన్ ప్రారంభంలో పత్తి క్వింటాల్ ధర రూ.6,900 పలకగా, నవంబర్‌లో రూ.6,500కు పడిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ.6,400 చెపుతున్నప్పటికీ... నాణ్యత లేదని రూ.5,500 మించి కొనడం లేదని రైతులు చెపుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి క్వింటాకు రూ.7,020 మద్దతు ధర ప్రకటించింది. వ్యాపారులు పలు రకాల కారణాలను చూపిస్తూ తక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికి జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతోపాటు, పత్తి నాణ్యత లేకపోవడంతో ధర పడిపోయిందని వ్యాపారులు చెపుతున్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డులో పత్తి క్వింటా ధర రూ.6,400ల – రూ.6,500కు మించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు సిండికేటుగా మారి ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ప్రతీరోజు పత్తి కొనుగోళ్లు ప్రారంభించే ముందు ట్రేడర్లు సిండికేటై మొక్కుబడిగా జెండా పాట పెట్టి, ఆ తరువాత కొనుగోళ్లు మొదలు పెడతారని, నాణ్యమైన పత్తిని తెచ్చినా జెండా పాట ధర కంటే తక్కువగానే కొంటున్నారని చెబుతున్నారు. మార్కెట్‌కు తెచ్చిన పత్తిని తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక ఎంతకో కొంతకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



వేబ్రిడ్జిపై పత్తి కాంటా పెడుతున్న దృశ్యం

వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పత్తి కొనుగోళ్లు చేపడుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో కొందరు లైసెన్స్ లేకుండానే పత్తి కొనుగోలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పత్తి కొనుగోళ్లపై చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావును వివరణ కోరగా... మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిబంధన ప్రకారమే జరుగుతున్నాయి. నిబంధనలు అతిక్రమించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పత్తి ధర దయనీయం..



పత్తి ధర దయనీయంగా మారింది. మార్కెట్‌కు పత్తిని తీసుకొస్తే వ్యాపారులు నాణ్యత లేదని క్వింటాకు రూ.5,700కే కొనుగోలు చేశారు. ఈ ఏడాది 5 ఎకరాల్లో పత్తి సాగు చేస్తే ఎకరానికి 3 – 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు. పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

– పద్దం భద్రయ్య, రైతు, చండ్రుగొండ మండలం

రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశా



రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేస్తే ఎకరానికి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. జూలూరుపాడు మార్కెట్‌లో పత్తి క్వింటాకు రూ 5,800లకు అమ్ముకోవాల్సి వచ్చింది. అకాల వర్షంతో చేనులోనే పత్తి తడిసిపోవడం వల్ల రంగు మారిందని వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేశారు.

– ముత్తయ్య, రైతు, అన్నపురెడ్డిపల్లి మండలం

గిట్టుబాటు ధర రావడం లేదు



మార్కెట్‌లో నాణ్యమైన పత్తికి కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. కొణిజర్ల మండలం ఎల్లన్న నగర్ నుంచి వాహనంలో జూలూరుపాడు మార్కెట్‌కు పత్తి తీసుకొచ్చా. క్వింటాకు రూ.6,300కే అమ్మిన. ఈ ఏడాది 4 ఎకరాల్లో పత్తి సాగు చేస్తే రెండు విడతల్లో 25 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది.

– రాపోలు శ్రీను, రైతు, కొణిజర్ల మండలం

పాత పెన్షన్ స్కీం అమలు చేయాలి

ఇల్లెందు: నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కిషోర్ సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంతో కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించి విడుదల చేయాలని కోరారు. ఆగిపోయిన ప్రమోషన్లు, బదిలీలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఏ.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా పి.జయరాజు, ఉపాధ్యక్షుడిగా టి.శేషగిరిరావు, కె.అన్నపూర్ణ కోశాధికారిగా బి.పాపారావులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న కిషోర్ సింగ్

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. నున్నా రంగారావు, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన ఎన్‌పీడీసీఎల్ ప్రతినిధులు



వరుణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): టీఎస్ ఎన్‌పీడీసీఎల్ నూతన సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని జిల్లా టీఎస్ యూఈఈయూ (సీఐటీయూ) ఎన్‌పీడీసీఎల్ కంపెనీ కమిటీ ప్రతినిధి బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బొల్లి వెంకటరాజు, కొలగాని రమేష్, వర్మ, కె.శ్రీనివాస్, పులి గణేష్ పాల్గొన్నారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: కరోనా కొత్త వేరియంట్ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం కొత్త వేరియంట్ వ్యాప్తి వేగవంతంగా ఉన్నట్లు సమాచారం ఉందని, గతం మాదిరిగా ప్రజలంతా ముందు జాగ్రత్త చర్యగా విధిగా మాస్క్ ధరించాలని కోరారు. ఇప్పటివరకు జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాకున్నా జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలంతా గుర్తించాలన్నారు.

కొత్తగూడెంఅర్బన్: పెరుగుతున్న కోవిడ్ కేసులతో అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్‌తో ఆందోళన వద్దు.. అప్రమత్తతే మనకు హద్దు... అని కరోనా వైరస్ బారిన పడకుండా కాపాడుకుందామని కొత్తగూడెం మున్సిపల్ చెర్మ్రపర్సన్ కాపు సీతాలక్ష్మి సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో వేగంగా పెరుగుతున్న కరోనా కేసుల నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కోవిడ్ కేసుల పట్ల ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వీయ జాగ్రత్తలు పాటిస్తే కరోనా వైరస్‌ను అంతం చేయడం సులభమేనని పేర్కొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తగూడెంఅర్బన్: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెస్లీ అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘానికి సంబంధించి జనరల్ ఫండ్ సేకరించి, ఆ ఫండ్‌తో సంఘం కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులకు బ్యాంకులో ఉన్న పథకాలను వివరించారు. అవసరమున్న పెన్షనర్లకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు.

అనంతరం ఆరుగురు పేద మహిళలకు చీరలు, బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, యూనిట్ సెక్రెటరీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరు అందించండి



అధికారులతో మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ: పాత పాల్వంచలోని చింతల చెరువు ఆయకట్టు రైతులకు రెండో పంట యాసంగికి నీరు ఇవ్వాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అధికారులను కోరారు. బుధవారం చింతల చెర్వు ఆయకట్టు రైతులు, చేపల కమిటీ సభ్యులతో ఇరిగేషన్ అధికారులతో చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నదని, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెండో పంటకు నీరు అందించకపోతే రైతులు మరింత నష్టపోతారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ బి.అర్జున్, డీఈ ఎం.రాణి, ఏఈఈ మంగు, మత్స్య సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నత్త నడకన ధోబీ ఘాట్ నిర్మాణ పనులు

ఇల్లెందు: పట్టణంలోని 18వ వార్డులో నిర్మాణంలో ఉన్న ధోబీ ఘాట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ఫిబ్రవరి నెలలో నిధులు మంజూరు కాగా రెండు నెలల క్రితం పనులు ప్రారంభం అయ్యాయి. అయితే ఇప్పటి వరకు నిర్మాణం పూర్తి చేసుకుని రజకులకు అందుబాటులోకి రావాల్సిన ధోబీ ఘాట్ పనులు పునాదులు, పిల్లర్ల దశలోనే ఉన్నాయి. నత్తనడకన సాగుతున్న పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. పట్టణంలోని రజకుల సౌకర్యార్థం రూ.2 కోట్లతో ధోబీ ఘాట్ నిర్మాణం పనులు సాగుతున్నాయి. రజక వీధికి సమీపంలో ఖాళీ స్థలంలో ఈ నిర్మాణ పనులు చేపట్టారు. మోడ్రన్ టెక్నాలజీతో చేపట్టే ఈ ధోబీ ఘాట్‌ను రజకులు ఉపయోగించుకుని వృత్తిని మెరుగు పర్చుకోవాలని, పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను చైర్మన్ డీవీ ఆదేశించారు.



ధోబీ ఘాట్ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ

ఆరోగ్యంగా సులభంగా బట్టలు ఉతికి ఆరబెట్టి ఇస్త్రీ కూడా చేసి అందించే ఈ యూనిట్ ఇల్లెందుకే తలమానికంగా మారుతుందని తెలిపారు. అందుబాటులోకి వస్తే మెకానిక్‌లు, టెక్నీషియన్‌లు అందుబాటులో ఉంటారని, ఏ చిన్న మరమ్మతు వచ్చినా వెంటనే పూర్తి చేసి పనిలోకి వచ్చేలా చేసే అవకాశం ఉందన్నారు. రజక సంఘం నేతలు కృష్ణ, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

అట్రాసిటీ కోర్టు ఏర్పాటు చేయాలి



న్యాయవాద పరిషత్ జిల్లా యూనిట్ సభ్యులు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎస్సీ, ఎస్టీ అటీసిటీస్ కన్జ్యూమర్ కోర్టును ఏర్పాటు చేయాలని న్యాయవాద పరిషత్ జిల్లా యూనిట్ డిమాండ్ చేసింది. బుధవారం కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాద పరిషత్ యూనిట్ ప్రెసిడెంట్ అనుబ్రోలు రాంప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం జిల్లా ఫాస్ట్ ట్రాక్ ఫోక్సో కోర్టులో ఫుల్ టైం జ్యుడీషియల్ ఆఫీసర్‌ను నియమించాలని కోరారు. అత్యాచారం, లైంగిక నేరాలకు వ్యతిరేకంగా పిల్లల రక్షణ కోసం, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు అయినప్పటికీ పూర్తిస్థాయి జ్యుడీషియల్ ఆఫీసర్‌ని నియమించలేదన్నారు. అదనపు బాధ్యతల వల్ల కేసుల పురోగతి ఆలస్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ వైస్ ప్రెసిడెంట్ రాంచంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీ వేణువాసురావు, సెక్రటరీ విఠల్ పాతూరి, కొత్తగూడెం బార్ ఈసీ సభ్యులు రామారావు, న్యాయవాదులు అరికెలా రవికుమార్, గురుమూర్తి, శివకుమార్ మధుకర్, రవితేజ, రమేష్ నాయక్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సింగరేణి విద్యార్థుల ప్రతిభ

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్ కిట్స్ కళాశాలలో ఈనెల 18, 19 తేదీలలో నిర్వహించిన అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. విజేతల వివరాలు...

- ఎం.ఇందు 1500 మీటర్లు, 5 కి.మీ పరుగులో ప్రథమ స్థానం
- ఎం.సింధు 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో మొదటి స్థానం
- ఎ.వందన డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో ద్వితీయ
- 400 గీ 4 మీటర్ల పరుగుపందెంలో ఎం.ఇందు, ఎం.స్వాతి, బి.ప్రమీల, ఎం.సింధు ద్వితీయ
- రేణుక హ్యామర్ త్రోలో ప్రథమ స్థానం

వీరితోపాటు మరికొంత మంది త్వరలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను సింగరేణి జీఎం (ఎడ్యుకేషన్) ఎస్.వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ బి.నికోలస్, ప్రిన్సిపాల్ సీహెచ్ శారద, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

సింగరేణిని పరిరక్షిస్తాం...



మాట్లాడుతున్న మాధవనాయక్

టేకులపల్లి: సింగరేణిని పరిరక్షించేందుకు కార్మికులు బీఎంఎస్‌ని గెలిపించాలని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ కార్మికులను కోరారు. ఈ మేరకు బుధవారం కోయగూడెం ఓపెన్‌కాస్టులో జరిగిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గత ప్రభుత్వం రాజకీయ స్వార్థ ప్రయోజనం కోసం కొత్త బొగ్గు గనుల వేలంపాటలో పాల్గొనకపోవడం వలన సింగరేణిలో ప్రస్తుతం ఉన్న బొగ్గు గనుల నిల్వలు అంతరించిపోతున్నాయని, రాబోయే కాలంలో ఉన్న ఉద్యోగుల భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే కొత్త బొగ్గు గనుల వేలంపాటలో పాల్గొని కొత్త గనులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు, పిల్లలకు మెరుగైన విద్య కోసం కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం సింగరేణిని ఏటీఎంగా మార్చుకొని నిధుల దుర్వినియోగంపై మరియు సింగరేణి చైర్మన్ అక్రమ కొనసాగింపుపై హైకోర్టు ద్వారా పోరాటం చేసిన ఘనత మా యూనియన్‌ది కావున సింగరేణిలో ఈనెల 27న జరగనున్న కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాగడ గుర్తుపై ఓటు వేసి బీఎంఎస్ గెలిపించాల్సిందిగా కోరారు. సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యాన్ని అరికట్టి కొత్త బొగ్గు గనులను సాధించి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేది బీఎంఎస్ అని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు 250 గజాల ఇంటి స్థలము మరియు రూ.20 లక్షల వడ్డీ లేని రుణము ఇప్పించేందుకు బీఎంఎస్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాబోయే జేబీసీసీఐ 12వ వేతన ఒప్పందాన్ని సకాలంలో కమిటీ ఏర్పాటు కృషి చేస్తామని పేర్కొన్నారు. కావున కార్మికులందరూ కాగడా గుర్తుకు ఓటు వేసి బీఎంఎస్ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆరుట్ల మాధవరెడ్డి, ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షుడు నాయిని సైదులు, ఏరియా కార్యదర్శి లీలా కృష్ణ, రాము, గోపాల్, అల్లి ప్రకాష్ కిష్టారం ఓసీ పిట్ సెక్రెటరీ ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల రక్షణకు సీఐటీయూను గెలిపించండి



మాట్లాడుతున్న ఏజే రమేష్

టేకులపల్లి: సింగరేణి సంస్థ పరిరక్షణకు సీఐటీయూను గెలిపించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కోయగూడెం ఓసీలో పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బొగ్గు గనులను ప్రైవేటు కంపెనీలకు కారుచౌకగా అమ్ముకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేది సీఐటీయూ అన్నారు. ఆ ప్రభుత్వాలకు, యాజమాన్యానికి వత్తాసు పలికే సంఘాలను ఓడించాలని పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులకు విద్య, వైద్యం భారంగా మారిందని, సింగరేణి ఆస్పత్రులలో అన్ని సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తామన్నారు. నాణ్యమైన విద్యను అందించే విధంగా విద్యాలయాలు తీర్చి దిద్దుతామని తెలిపారు. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మాణానికి ఇంటి స్థలం, నిధులు కేటాయిస్తామని, సింగరేణి స్థలాలు, క్వార్టర్లు కార్మికులకు ఇచ్చి సొంత ఇంటి కల సాకారం చేస్తామని చెప్పారు. నూతన బొగ్గు గనుల కోసం పోరాడుతామని, బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో సీఐటీయూ ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, మండల నాయకులు ఈసం నర్సింహారావు, రాము, చంద్రశేఖర్, పూనెం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీకి ఆదరణ



మాట్లాడుతున్న ఆల్బర్ట్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఐఎన్‌టీయూసీ చేపట్టిన బాయి బాట కార్యక్రమానికి ఆకర్షితులై, కార్మికుల సమస్యల పట్ల ఐఎన్‌టీయూసీ చూపుతున్న ఆదరణను చూసి చాలమంది కార్మికులు యూనియన్‌లో చేరుతున్నారని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్ అన్నారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీలో పనిచేస్తున్న కార్మికులు 60 మంది ఐఎన్‌టీయూసీలో చేరారు. వీరికి యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారం రోజుల నుంచి ఇప్పటికి 160 మందికి పైగా కార్మికులు వివిధ యూనియన్ల నుంచి కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరినట్లు చెప్పారు. ఇటీవల రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి ప్రజలు కాంగ్రెసుకు పట్టం కట్టారు. ఇదే స్ఫూర్తితో సింగరేణిలో ఈనెల 27న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ తప్పకుండా గెలిచి గుర్తింపు హోదా రానుందన్నారు. 2003లో గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఐఎన్‌టీయూసీ కార్మికులకు ఎన్నో హక్కులు సాధించి పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో గుర్తింపు సంఘం ఎన్నికలను పురస్కరించుకొని అందిరి చూపు ఐఎన్‌టీయూసీ వైపే ఉందరన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలను వివరించారు.

- నూతన అండర్ గ్రౌండ్ బొగ్గు గనులను ప్రారంభింపజేసి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం. తద్వారా సంస్థలో కార్మికుల సంఖ్య పెరుగుతుంది.
- బొగ్గుగనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటాము.
- కార్మికులకు సొంత ఇంటి పథకం కింద 250 గజాల స్థలంతోపాటు ఇళ్లు కట్టుకోవటానికి రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తాం,
- ప్రకృతికి విరుద్ధంగా ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్న సింగరేణి కార్మికులకు చెల్లించే అలవెన్స్‌లపై (ఫెర్క్స్) ఆదాయంపై ఇన్‌కమ్ ట్యాక్స్ యాజమాన్యంచే కట్టిస్తాం,
- సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో ఆస్పత్రులను ఆధునికరించి, ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తాం
- మహిళా కార్మికులకు అన్ని మౌలిక వసతులు కల్పించి, గౌరవ ప్రదమైన ఉద్యోగం (అండర్ గ్రౌండ్‌లలో దింపకుండా) సర్ఫేస్‌లో ఉద్యోగం ఇప్పిస్తాం

సింగరేణిలో ఉత్తమ గృహాల పరిశీలన

ఇల్లెందు: సింగరేణి ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్తమ గృహాల ఎంపిక కోసం పలు ఇళ్లను పరిశీలించారు. బుధవారం సింగరేణి ఇల్లెందు ఏరియాలో ఓల్డ్ కాలనీ, జేకే కాలనీలోని అధికారులు, కార్మికుల గృహాలను పరిశీలించి ఉత్తమ గృహాలను ఎంపిక చేశారు. సింగరేణి ఉత్సవాల సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు ధనుంజయరెడ్డి, రవికుమార్, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.